
# అలామొదలైంది - ..



చందమామతో మొదలైన నా పుస్తక పఠనం ..వారపత్రికలు, మాసపత్రికలతో విడదీయలేని బంధమేర్పడింది. సాహితీ పఠనం అనే మంచి వ్యసనం ఎక్కడిదాకా వెళ్లిందంటే మా నాన్నగారి ఉద్యోగరిత్యా హెచ్ ఎ ఎల్ కాలనీలో ఉండేవాళ్లం . అక్కడ లైబ్రరీలో గంటలు గంటలు గడిపేవాణ్ని . అన్ని పత్రికలనీ, నవల్లనీ కళ్లతో జుర్రుకుని మెదడులో దాచుకుని మురిసిపోయేవాడిని , వీరేశలింగంపంతులు, విశ్వనాథ సత్యనారాయణ, చలం, కొడవటిగంటి, డా"కొమ్మూరి వేణుగోపాల్రావు , రావూరి భరద్వాజ, ముప్పాల రంగనాయకమ్మ , యద్దనపూడి సులోచనారాణీ , వాసిరెడ్డి సీతాదేవి ఇలా ఒకరనేంటి అందరి రచనా సంవిధానాలనీ , కన్యాశుల్కం, అసమర్థుని జీవితయాత్ర, వేయిపడగలు, కాంతం కథలు, అమరావతి కథలు ఇలా ఒకటనేంటి అన్ని పుస్తకాలనీ మనసు లైబ్రరీలో పదిలపర్చుకున్నాను. ఒకసారి ఏమైందంటే..'నాయనా మన లైబ్రరీలో నువ్వు చదవడానికి ఇంక ఏవీ లేవు..ఒక్క డిక్షనరీలు తప్ప ' అని చేతులెత్తేశాడు రంగారావు ద లైబ్రేరియన్ . పుస్తక పఠనం విపరీతంగా అలవాటైన నేను దిక్కుతోచక కొని చదవడం మొదలెట్టాను (ఇదంతా చదువుకునే రోజుల్లోనేనండోయ్ ..పాకెట్ మనీతో కొనుక్కునే వాణ్ని ). తమ రచనలతో ప్రభావితం చేసి , నన్ను కలం పట్టేల స్ఫూర్తినిచ్చింది మాత్రం యండమూరి, మల్లాది, సూర్యదేవరగార్లు..దాంతో 'మనమెందుకు రాయకూడదు' అని రాయడంలో అ ఆ ఇ ఈ (A B C D ల బదులు తెలుగు ప్రయోగం)లు తెలియకుండానే కాగితాల మీద అక్షర కసరత్తులు ప్రారంభించాను.

కానీ ఎలా పంపాలో తెలియదాయే ! అయినా సరే పత్రికలకి పంపించి .. విడుదలైన పత్రికల్లో నా పేరు ఉందేమో చూసుకునేవాడిని(ఎంత అత్యాశో చూడండి!) రెండు వారాల్లో పోస్ట్ మేన్ రిటర్న్ కవర్లు ఇంట్లోవున్న నా ముఖం మీద విసిరికొట్టేవాడు . నిరుత్సాహం..నిలువెల్లా నిరుత్సాహం . ఇలా అలెగ్జాండరు దండయాత్రలా ..రచనలతో పత్రికల మీద దాడి చేస్తూ ..ఓడిపోతూ..సాగు..తుం..టే. ఒకసారి ఆంధ్రసచిత్రవారపత్రికలోని డా ||కొత్త రవీంద్రబాబుగారి ముఖాముఖిలో 'సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి ఉందా?' అన్న నా ప్రశ్న ఉత్తమప్రశ్నగా ఎంపికయింది. దానికి గానూ ఆయన నవల 'చిరు సిగ్గేసింగారం ' బహుమతిగా ఇవ్వడమే కాక ఆర్నెళ్లపాటు ఆంధ్రసచిత్రవారపత్రిక ఉచితంగా వచ్చింది . 'ఏంటి బాబూ మీరు రచయితా .. కాంప్లిమెంటరీ కాపీలు వస్తున్నాయి..మన కాలనీలో ఒక రచయిత ఉన్నందుకు ఆనందంగా ఉందండీ' అదీ మొట్ట మొదటి ప్రశంస నేను మా పోస్ట్ మేన్ నుంచీ అందుకున్నది . దాంతో నాలోని రచయిత జూలు విదిల్చాడు . కానీ రచనలు పంపడం..తిరిగిరావడం షరామామూలే! మళ్లీ నిరాశ. ఆ తర్వాత నా మొట్ట మొదటి కథ 'డీడీర్ ఉగాది పచ్చడి ' ఆంధ్రసచిత్రవారపత్రికలో ఎంపికవడం ..ఉగాది ప్రత్యేక సంచికలో ప్రచురించబడడం ఒక గొప్ప జీవితకాల మధురానుభూతి.

ఆ తర్వాత ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో నా కథ 'మామిడి పండు' ప్రచురితమైంది. తర్వాత్తర్వాత ఇతర పత్రికల్లో ప్రచురించబడడమూ మొదలయ్యాయి . ఇప్పుడంటే అంతర్జాల పత్రికలతో సహా రచయితల కోసం ఎన్నో వేదికలున్నాయి. అప్పుడేవి? నన్ను బాగా ప్రోత్సహించింది మాత్రం గోతెలుగు (దాదాపు యాభై కథలు ప్రచురితమయ్యాయి). కొత్తరచయితలను వెన్నుతట్టి కలం పట్టించేది గోతెలుగు మాత్రమే అన్నది నిర్వివాదాంశం . నా రచనా వ్యాసంగపు మొదట్లో గోతెలుగు ఉండుంటే రచయితగా ఈపాటికి ఉత్కృష్ట స్థాయిలో ఉండేవాణ్ని . ఎప్పటికైనా రచనలు తిరిగిరాని పరిణతి పొందిన స్థితికి చేరుకోవాలని నా ఆకాంక్ష . రచయిత అనేవాడు మనుషుల్ని, పరిసరాల్ని నిరంతరం పరిశీలిస్తూ , 'మనం రాసిన దానికి పాఠకుడు ఎలా స్పందిస్తాడు ?' అని

పాఠకుడి వైపున ఉండి ఆలోచిస్తే రచనల్లో నాణ్యత చోటుచేసుకుంటుంది . గుర్తింపు తీసుకొస్తుంది . అప్పట్నుంచీ..ఇప్పటి వరకూ ఎంతో మంది ఎడిటర్లు నా రచనలు ప్రచురించి ప్రోత్సహించారు . వాళ్లందరికీ ఈ సందర్భంగా వినయపూర్వక కృతజ్ఞతలు . మొదట్లో, పత్రికలో నా రచన పడడం కుతూహలంగా ఉండేది . రాను రాను నిబద్ధతతో , సమాజహితంగా, ప్రయోజనాత్మకంగా, నిర్మాణాత్మకంగా రచనలు చేసి సాహితీ ప్రపంచంలో నాదైన, గుర్తింపు పొందిన కొంత స్థలం సంపాదించుకునేలా ఆశీస్సులు అందించాలని అక్షరజ్ఞాన ప్రసాది సరస్వతీదేవికి నా విన్నపం . అక్షరజ్ఞానం ఉండడమూ , అది రచనల పేరుతో అందరితో పంచుకోవడమూ ఆ కళలతల్లి అయాచితవరమే, ఖచ్చితంగా నా పూర్వజన్మ సుకృతమే!

**- ప్రతాపవెంకట సుబ్బారాయుడు**

**0**

**Comments**

## మరిన్ని శీర్షికలు


- **అరుణాచలం** - పి.యస్.యమ్.లక్ష్మి
- **అవీ - ఇవీ** - భమిడిపాటి ఫణిబాబు
- **నవ్వునాలుగుయుగాలు** - సరసి
- **వళంగైమాన్** - -కర్రా నాగలక్ష్మి
- **గ్యాస్ ట్రబుల్** - Dr. Murali Manohar Chirumamilla
- **పిల్లలతో అనుబంధాన్ని పెంపొందించుకోవడం వల్ల లాభాలు** - లలిత లాస్య
- **11-09-2015 నుండి 17-09-2015 వరకు వారాఫలాలు** - శ్రీకాంత్
- **సాహితీవనం** - వనం వెంకట వరప్రసాద రావు
- **హారస్** - -బన్ను




©All rights reserved to gotelugu